క్లుప్తంగా

నేడు మంత్రి రాక

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలకు నేడు రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు మండలాల్లో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మధుప్రియ ఎంపిక



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మధుప్రియ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రసన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల జరిగిన సెలక్షన్స్‌లో మధుప్రియ విజేతగా నిలిచి మార్చి 14, 15వ తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రసన్న తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నడికూడ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు కుటుంబ సభ్యులు వివాహం నిశ్చయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు వివాహాన్ని అడ్డుకుని బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయితే అధికారులు వెళ్లిన తరువాత బాలికకు వివాహం జరిపించినట్లు సమాచారం.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రాయపర్తి : పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి తెలిపారు. మండలంలోని బందనపల్లి, జగన్నాథపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మహిళలు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

నెక్కొండ : వివిధ కులాల కార్పొరేషన్ల ఏర్పాటు నేపథ్యంలో సీఎం కేసీఆర్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి ఆర్యవైశ్య, యాదవ సంఘాల నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు దేను లక్ష్మణ్, దొడ్డ విజయ్‌కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తాళ్లూరి నర్సింహస్వామి, గోరంట్ల వెంకట్ నారాయణ, నంగునూరి కృష్ణమూర్తి, చిదురాల రాజు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి..

రాయపర్తి : రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటును హర్షిస్తూ మండలంలోని మైలారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రెడ్డి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పైడిపల్లి భీమారెడ్డి, నాయకులు ఈదులకంటి మహేందర్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, ఐరెడ్డి ఎల్లారెడ్డి, మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, మైబు, పరుపాటి రాజిరెడ్డి, పరుపాటి యాకూబ్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, తుమ్మ భూపాల్‌రెడ్డి, బొమ్మినేని రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

సంగెం : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. మండలంలోని గవిచర్లలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా విచారణ కోసం వెళ్లిన తనను గ్రామానికి చెందిన దొనికెల శ్రీనివాస్ అడ్డుకుని దూషించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను బుధవారం అరెస్టు చేసి జ్యూడీషియల్ విచారణకు పంపించినట్లు ఆయన వెల్లడించారు.

విద్యుదాఘాతంతో దున్నపోతు మృతి

చెన్నారావుపేట : విద్యుదాఘాతానికి గురై దున్నపోతు మృతి చెందిన సంఘటన మండలంలోని పాపయ్యపేటలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రామగోని రవి పశువులను గ్రామ శివారులోని వాగు వద్దకు తీసుకెళ్లిన క్రమంలో తెగిపోయిన 11 కేవీ విద్యుత్ తీగ దున్నపోతుపై పడింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. దున్నపోతు విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగెలు

వాగు వెంట విద్యుత్ తీగెలు ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు మీడియాకు తెలిపారు. మరిన్ని విద్యుత్ తీగలు కూడా తెగి పడే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించి ప్రాణనష్టం కలుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ
- పిల్లల తల్లులకు అవగాహన



శాయంపేట : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సునీతారెడ్డి

శాయంపేట : చిరుధాన్యాలను తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏడో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ నిర్వహించగా ముఖ్యఅతిథిగా సూపర్‌వైజర్ సునిత పాల్గొని మాట్లాడారు. బాల్యం దశలో పిల్లలకు ఏ విధంగా విద్యను బోధిస్తే అర్థమవుతుందో తల్లులకు వివరించారు. ఎల్‌కేజీ, యూకేజీ వర్క్స్ బుక్స్, ప్రీ స్కూల్ కిట్లు, ఆట వస్తువులు, బొమ్మలతో ఆడిస్తూ ఆహ్లాదకర వాతావరణంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, అరుణ, జోష్న, రత్నమాల, రమ, ఆయా, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిరుధాన్యాలతో పాటు ఆకు కూరలు తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పోషణ అభియాన్ బ్లాక్ కో–ఆర్డీనేటర్ తేజశ్రీ అన్నారు. మండలంలోని కేశవాపూర్ గ్రామంలోగల రెండో అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా తల్లులు, బాలింతలు, గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం వలన స్త్రీలలో అనేక పోషక విలువలు సంవృద్ధిగా పెరిగి బలంగా తయారవుతారన్నారు. అలాగే బాలింతలు చిరుధాన్యాలు తీసుకోవడం వలన భవిష్యత్‌లో మేలు జరుగుతుందన్నారు. గర్భిణుడు పోషకాహారం తీసుకోవాలని, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని అన్నారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో పాలకుల నిర్లక్ష్యంతో వలసలు

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గ్రామీణ ప్రాంత కూలీలు పట్టణాలకు వలస పోతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య తెలిపారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కోత విధిస్తోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలువురి జాబ్ కార్డులను తొలగించాయని తెలిపారు. ఉపాధి పనులను గ్రామాల్లో విస్తృతపర్చి వ్యవసాయ కార్మికులకు పని భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం ఉపాధి హామీ పనులపై నిర్లక్ష్యంతో ఉందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గౌతం, చేరాలు, మొగిళి, పసునూరి సుజాత, నర్సక్క, రవీందర్, మల్లేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

సైడ్‌కాల్వ నిర్మాణ పనులు ప్రారంభం



సంగెం : మండలంలోని కుంటపల్లిలో రూ.3.60 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్‌కాల్వ నిర్మాణ పనులను ఎంపీపీ కళావతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండల ప్రజాపరిషత్ నిధులు కేటాయించగా పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కావటి వెంకటయ్య, ఎలుగోయ లింగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జున్న కొమురుమల్లు, పంచాయతీ కార్యదర్శి వాజీద్, నాయకులు పెంతల ప్రతాప్, కాగితాల జగన్నాథ చారి, జున్న రాజమల్లు, స్వామి పాల్గొన్నారు.

ఐటీడీఏ నిధులతో..

గీసుకొండ : మండలంలోని విశ్వనాధపురంలో ఐటీడీఏ నుంచి కేటాయించిన రూ. 20 లక్షలతో డ్రైనేజీ, అంగన్‌వాడీ కేంద్ర మరమ్మతు పనులకు ఎంపీపీ బీమగాని సౌజన్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ సహాయక ఇంజనీర్ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు చాడ కొమురారెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు రుద్రప్రసాద్, నాయకులు కూసం రమేశ్, నాగారం స్వామి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మెగా హెల్త్ క్యాంపు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవ పథకం, మహిళా సాధికారత సెల్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ డయాగ్నోస్టిక్స్ హబ్ సౌజన్యంతో బాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం మెగా హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ మాట్లాడారు. కమ్యూనిటీ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 100 మందికిపైగా పట్టణవాసులు, విద్యార్థులు, సిబ్బంది రక్త పరీక్షలు చేసుకున్నారని చెప్పారు. నేడు (గురువారం) కూడా క్యాంపు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ.శివనాగ శ్రీను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.రమేశ్, మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డాక్టర్ టి.సుమతి, సభ్యులు డాక్టర్ జి.ప్రసూన, ఎం.శైలజ, ఏ.పావని, తోట రమేశ్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ లకన్‌సింగ్, ఎం.నరేందర్, డాక్టర్ వి.పూర్ణచందర్, ఎం.సమ్మయ్య, డాక్టర్ ఆర్.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

వర్ధన్నపేట : వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ కోరారు. పట్టణంలోని వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారిపై బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటేనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు. కార్లు నడిపే వ్యక్తులు సీటు బెల్టు ధరించాలని, నిర్ణీత వేగాన్ని మించొద్దని, మద్యం సేవించి వాహనాన్ని నడపొద్దని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతోపాటు లైసెన్స్, ఇతర పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సమకరించాలని కోరారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం



నల్లబెల్లి : మండలంలోని మూడుచెక్కలపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడుగా పని చేసిన సువర్ణపాక జగ్గారావుకు పాఠశాల ఆవరణలో బుధవారం ఉద్యోగ విరమణ సన్మానం చేశారు. ఈ సందర్భంగా సభకు పీజీ హెచ్‌ఎం సాంబయ్య అధ్యక్షత వహించగా సావిత్రి–జగ్గారావు దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధుమిత్రులు శాలువాలు, పూలదండలతో సన్మానించి మెమొంటో బహూకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాజు మాట్లాడారు. జగ్గారావు 34 ఏళ్లు ఉపాధ్యాయుడిగా సేవలు అందించారని అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందాడని చెప్పారు. అనంతరం చదువు ప్రాముఖ్యత, బాల్యవివాహాలతో కలిగే అనర్థలను వివరిస్తూ విద్యార్థినులు ప్రదర్శించిన నాటికలు చైతన్యం నింపాయి. కార్యక్రమంలో ఏసీఎంఓ శ్రీరాములు, పీజీ హెచ్‌ఎం గంగు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

నల్లబెల్లి : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిషత్ ఉంటుందని రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సారంగపాణి తెలిపారు. మండలంలోని మేడపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో రాణిస్తున్న 68 మంది బాల, బాలికలకు ప్రశంస పత్రాలతోపాటు క్రీడా దుస్తులు అందజేశారు. విద్యార్థులను క్రీడల్లో పోత్సహిస్తున్న ఉపాధ్యాయులకు ట్రాక్ సూట్స్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జవహర్‌లాల్ నెహ్రూ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదుపుతో ఆర్థిక పురోగతి

సంగెం : ప్రతినెలా పొదుపు చేసుకోవడంతో ఆర్థిక పురోగతి సాధించవచ్చని జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గవిచర్లలో శ్రీరామలింగేశ్వరస్వామి పురుషుల పొదుపు సంఘం 27వ వార్షిక మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులు, రైతు కూలీలు సంపాదనలో కొంత పొదుపు చేసుకోవడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తద్వారా అవసరాలకు తక్కువ వడ్డీకి రుణం, బోనస్, అప్పు పొందడంతోపాటు వృద్ధాప్యంలో ఇతరులపై ఆధారపడకుండా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పొదుపు సంఘం అధ్యక్షుడు గుండబోయిన ఎల్లగౌడ్, పాలకవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో శ్రీకంఠ మహేశ్వరస్వామి, సురమాంబదేవి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మేడి రమాదేవి దేవేందర్‌గౌడ్ కుమారులు మేడి శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్ రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలకు గౌడ సంఘం పెద్దలు మేడి ప్రభాకర్‌గౌడ్, సంఘం అధ్యక్షుడు కత్తి స్వామిగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సమ్మయ్య, మేడి సుధాకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

వడ్లకొండలో..

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం కరిమిళ్ల పద్మ–దుర్గారావు దంపతుల కుమారుడు అశ్విన్‌కుమార్–ఝాన్సీ దంపతులు రూ.50 వేల 116 విరాళం అందజేశారు.

ఆర్థిక పురోగతిలో మహిళలు కీలకం



నర్సంపేట : కుటుంబాలు ఆర్థిక పురోగతి సాధించడంలో మహిళలు కీలకమని మహిళా సమన్వయ సమితి అధ్యక్షురాలు చిలువేరు రజని భారతి స్పష్టం చేశారు. పట్టణంలోని వినియోగదారుల కార్యాలయంలో మహిళా సంఘాలు, వినియోగదారుల సంఘాల, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిశ, పోక్సో లాంటి ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా మహిళలకు రక్షణ ఉండడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. చట్టాలు, టోల్ ఫ్రీ నంబర్లు 181, 1098, 1930 గురించి అవగాహన పెంచుకుని ఆపద సమయాల్లో వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి మాట్లాడుతూ మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతోందన్నారు. అనంతరం ఆర్డీఓ కాసుల కృష్ణవేణి, రెజీనా చిన్నప్ప, రాష్ట్ర మహిళా వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షురాలు మైస వసంతకు అవార్డు అందజేసి సత్కరించారు. రాష్ట్ర వినియోగదారుల క్యాట్కో ఉపాధ్యక్షుడు డాక్టర్ ఠాకూర్ రతన్‌సింగ్, ఓరుగల్లు వినియోగదారుల కౌన్సిల్ అధ్యక్షుడు యుగంధర్, డీసీఐసీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురికి శిక్ష

నెక్కొండ : ఈనెల 12వ తేదీన మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కిన మండలానికి చెందిన వెంకన్న, అశోక్, రవి, రవీందర్‌ను నర్సంపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు శిక్ష విధించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. వారిని కోర్టులో హాజరు పర్చగా అశోక్, రవి, రవీందర్‌లకు న్యాయమూర్తి రూ.3700 జరిమానా, వెంకన్నకు రెండ్రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



సంగెం : మండల కేంద్రంలోని విద్యాభారతి హైస్కూల్‌లో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతులు బోధించారు. ఆర్జేడీగా సామ్యుల్‌రాజ్, డీఈఓగా కలహంసి, ఎంఈఓగా సహాస, ప్రిన్సిపాల్‌గా తరుణ్, వైస్‌ప్రిన్సిపాల్‌గా హిమబిందు, కరస్పాండెంట్‌గా సాయి తేజ, ఉపాధ్యాయులుగా పలువురు వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్‌లు మినుముల రాజు, మైదంశెట్టి చందర్‌రావు, మధు పాల్గొన్నారు.

ఇంటర్నెట్‌ను మంచికోసమే ఉపయోగించాలి

- సీఐ రవిరాజు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ

పరకాల : మారుతున్న కాలానికనుగుణంగా ఇంటర్నెట్ కీలకమైందని, యువత, విద్యార్థులు మంచికోసమే ఉపయోగించాలని సీఐ రవిరాజు సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి టలెంట్ టెస్ట్ విజేతలకు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుపై దృష్టి సారించి మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, మండల అధ్యక్షుడు ప్రశాంత్, మండల కార్యదర్శి ప్రేమ్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ పాల్గొన్నారు.

నర్సరీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- డీఆర్‌డీఓ నాగపద్మజ



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ నాగపద్మజ

కమలాపూర్ : ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని డీఆర్‌డీఓ నాగపద్మజ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని అంబాల గ్రామపంచాయతీ నర్సరీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నాగపద్మజ మాట్లాడుతూ.. ప్రతి నర్సరీలో నూరు శాతం జర్మినేషన్ ఉండే విధంగా చూడాలని, గృహ అవసరాల నిమిత్తం పూలు, పండ్ల మొక్కలతో పాటు రోడ్డుకిరువైపుల నాటే మొక్కలను పెంచాలని సూచించారు. ప్రతి నర్సరీలో నైపుణ్యం కలిగిన వనసేవకులను నియమించాలని అన్నారు. ఉదయం, సాయంత్రం మొక్కలకు నీటిని అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు తప్పనిసరిగా నర్సరీలను పరిశీలించాలని, మండల స్థాయి సిబ్బంది వారానికి ఒక్కసారైనా నర్సరీలను సందర్శించి రిజిష్టర్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

వంద మంది కూలీలకు పని కల్పించాలి

ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కనీసం వంద మంది కూలీలకు పని కల్పించాలని డీఆర్‌డీఓ నాగపద్మజ అధికారులను ఆదేశించారు. ఉదయం 7గంటలకు గ్రామాల్లో ఉపాధి హామీ పనిని ప్రారంభించి కనీస వేతనం రూ. 272 వచ్చే విధంగా కొలతలు మార్క్ చేసి కూలీలను ప్రోత్సహించాలన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేలా చైతన్య పర్చాలన్నారు. ప్రభుత్వ సంస్థల్లో కూడా హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసిపట్టే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలో కనీసం ఐదారుగురు రైతులను పండ్ల తోటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే కనీసం ఐదుగురు రైతులు పశువుల పాకలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. ప్రతి రైతుకు పొలం వద్ద కంపోస్ట్ గుంతలు నిర్మించుకునే విధంగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, ఏపీఓ రమేశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, ఈసీ తదితరులు పాల్గొన్నారు.

అవెన్యూ ప్లాంటేషన్‌లో మంటలు



అగ్నికి ఆహుతి అవుతున్న అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు

శాయంపేట : గత ప్రభుత్వం చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ అగ్నికి ఆహుతి అవుతోంది. మండలంలోని మాందారిపేట, గోవిందాపూర్ జాతీయ రహదారికిరువైపుల అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు ఏపుగా పెరిగాయి. అయితే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు వ్యాపించి అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. అధికారులు స్పందించి అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా చెట్లను కాపాడాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

- సీపీ అంబర్‌కిశోర్ ఝా



సర్టిఫికెట్ అందజేస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా

శాయంపేట : రక్తదానం మరొకరికి ప్రాణదానమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, భారత జాగృతి రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ బుధవారం 40వ సారి రక్తదానం చేశారు. ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన మహమ్మద్ మహబూబ్ జహానాకు ప్రమాదవశాత్తు కాలు ఫ్రాక్చర్ అయ్యింది. సర్జరీ అనంతరం ఆమెకు రక్తం అవసరం కావడంతో రక్తదానం చేసేందుకు అశోక్ ముందుకు వచ్చారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజును పురస్కరించుకొని రక్తదానం చేసినట్లు అశోక్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

విద్యార్థులకు పదోతరగతి కీలకం



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ప్రహాసిత్

పరకాల : విద్యార్థులకు పదోతరగతి కీలకమైందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రహాసిత్ అన్నారు. పదోతరగతి అనంతరం సామర్థ్యానికి తగిన కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పీఎంఎస్‌హెచ్‌ఆర్‌వై పాఠశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన శిక్షణలో భాగంగా పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల)లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 10వ తరగతి పరీక్షల్లో మంచి జీపీఏ సాధించేందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. చదువుపై ఏకాగ్రత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలంపాట

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్ (తైబజార్) వేలంపాటలో కోడెపాక సంజీవరావు 1లక్ష 75వేలతో కైవసం చేసుకున్నట్లు పంచాయతీకార్యదర్శి మడికొండ రత్నాకర్ తెలిపారు. గ్రామపంచాయతీలోని 7 షెటర్లకు ఈనెల 15వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.